# చింత చచ్చినా...

అది నాలుగు మండువాల భవంతి. దాని వయస్సు రెండు వందల సంవత్సరాలు. రెండు పక్కల పెణక కిందికి దిగిపోయింది. ఒకొక్క గదే వాసయోగ్యం కాకుండా పోతుంటే, పంతులుగారూ భార్యా తమ ఆవాసాన్ని బాగున్న గదుల్లోకి మార్చుకుంటూ వస్తున్నారు. ఇప్పుడు తూర్పుభాగంలో రెండు మండువాలూ మారిపోయాయి. పశ్చిమార్థంలో పంతులుగారి నివాసం.

ఆ ఇంట్లో వస్తువులన్నీ సుమారు ఇంటివయస్సుగలవే. ఒక పంతులు గారూ, భార్యా తప్ప మండువాలన్నీ వర్షాకాలంలో జలమయమయిపోతాయి. నీరవతలికిపోయీ తూములు పూడిపోవడంవల్ల. అంచేత ఆ ఇంట్లో కఱ్ఱ సామానులు అసలు వయస్సుకంటే ముసిలివిగా కనిపిస్తాయి.

పంతులుగారి తండ్రిది పెద్ద జమీ. తన చిన్నతనంలో ఆ ఇంటిశోభ చూసిన గుర్తుంది ఆయనకు. అంటే. వివరాలన్నీ గుర్తుంచుకోగల వయస్సు ఆయన కొచ్చేసరికి, జమీ పోవడం తండ్రి మరణించడం. మిగిలిన ఒక్క మామిడితోటమీదా వచ్చే ఆదాయంతో తను బతకడమేకాక, అంత పెద్ద ఇంటిబాగోగులు చేయించడం వంటి మార్పులన్నీ అకస్మాత్తుగా వచ్చిపడ్డాయి. అంచేత చిన్ననాటి స్మృతులు - అంటే ఆ యిల్లు మూడుపువ్వులూ ఆరు కాయలుగా ఉన్న రోజుల స్మృతులు - ఎప్పుడో కలలో కనిపించిన దృశ్యాల్లాగా ఆయనకు జ్ఞాపకం వున్నాయి.

భార్య రోగిష్టి. ఆయనే వండి. తను తినవలసిన స్థితి. ఆయనకు కాలక్షేపమల్లా సోమసుందరంగారితో. వెనకటి కబుర్లు చెప్పుకుంటూ కూచోడం. సోమనాథం పంతులుగారి కంటే పదేళ్ళు పెద్ద - అంచేత ఆ ఇంటి సిరిసంపదలు పంతులుగారికంటె, స్పష్టంగా చూశారాయన. ఆయనకు పంతులుగారంటే నిజమైన అనురాగం - ఆ ఇంట పుట్టినందుకు భక్తికూడా.

పంతులుగారంటే ఆ ఊళ్ళో అందరికి భక్తే. స్థితిగతులు ఎలాంటివైనా ఆయన ఔదార్యం అందరూ గుర్తించిన వారే. నడివయస్సుతో ఆయన ఆ ఊరికి మకుటంలేని రాజు. నూటికి తొంభైవంతులు తగాదాలన్నీ ఆయన ముందు పరిష్కారమైపోయేవి.

పంతులుగారి మనసు ఎంతమంచిదో, నోరు అంతచెడ్డది. అది అ ఊళ్లో అందరికి తెలిసిన విషయమే గనుక ఎవరూ అట్టే పట్టించుకోరు. ఎవరన్నా కాని పనిచేస్తే వాళ్ల ఇంటికి వెళ్ళి, ఏమయ్యా నువ్విలాంటి పని ఎందుకు చేశావు అని కఱ్ఱ విరిచినట్లు అనేసేవాడు. ఆయనమీద భక్తివల్ల ఆ ఆసామీ ఏమీ అనలేకపోయేవాడు. అంచేత కాని పనులు చెయ్యడానికే జడిసేవారు ఆ ఊరిజనం.

అయితే క్రమంగా రోజులు మారాయి! ఆయనకు తెలీకండానే ఆయన పలుకుబడి తగ్గిపోయింది. ఆ సంగతి చూచాయగా ఆయనకు తెలిసినా, అది గుర్తించడానికి ఆయన

మనస్సు ఒప్పుకోలేదు. కారణం యీతరం కుర్రవాళ్ళెవరూ ఆయన పుట్టు పూర్వోత్తరాలు ఎరగరు. పైగా పైనుంచి వచ్చిన కుటుంబాలు కొన్ని. ఆ ఊరికి కొత్తగా వచ్చిన కుటుంబాలు కొన్ని. ఆ ఊరికి కొత్తగా వచ్చిన పంచదార ఫ్యాక్టరీకి సంబంధించినవి. అసలీ ఊరి సంగతిగాని ఆ నాలుగు మండువాల భవంతి విషయంగాని వాళ్ళు ఎరగరు. అంచేత వాళ్ళకి ఆయనమీద గౌరవం ఉండడానికి అవకాశాలు తక్కువ. ఆయన క్రమంగా ఊరి వ్యవహారాల్లో జోక్యం కలిగించుకోవడం మానేశాడు. అంచేత ఆయనమాట కాదనిపించుకునే పరిస్థితి రాలేదు. ఆయన తప్పించుకున్నాడనండి. కాని ఆయనలో ఒకమూల యీ ఊరికింకా మకుటంలేని రాజుననే భ్రమ చచ్చిపోలేదు.

ఆయనకు పెద్ద సమస్య ఆయన కొడుకు రంగయ్య. రంగయ్య ఇప్పుడెక్కడో ఉత్తరాదిని ఉద్యోగంలో ఉన్నాడు. రంగయ్య తన తాతగారి సంగతి వినడమేగాని చూసినవాడుగాడు. అతను పుట్టినప్పటినుంచీ దారిద్ర్యం తప్ప మరొకటి ఎరగడు. అంచేత తనతండ్రీ, సోమనాధంగారూ కలిసి వెనకటి కబుర్లు ఏకరువు పెడుతూంటే అవన్నీ వట్టి కట్టుకథలనుకునేవాడతను. వీలైనప్పుడల్లా సోమనాధంగారిని వేళాకోళం చేస్తుండేవాడు. తండ్రిని ఏమనడానికీ సాహసం చాలక.

ఒకసారి రంగయ్య చిన్నతనంలో ఒకసంగతి జరిగింది. తోడిపిల్లలతో కలిసి అతడు చెడుగుడు ఆడుతుండగా, ఒక సంపన్న గృహస్థు కొడుకు కూతకొస్తే, అతన్ని కిందపడేసి, గుండెలమీదెక్కికూర్చున్నాడు. ఆ సంపన్న గృహస్తు, సరదాగా ఆట చూస్తున్నవాడు పట్టరాని కోపమొచ్చి, రంగయ్యని ఏడుతరాల అటూఇటూ తిట్టరాని తిట్లు తిట్టాడు. రంగయ్య అన్నింటికీ ఒక చిరునవ్వు సమాధానంగా పారేశాడు.

ఈ సంగతి పంతులుగారికి తెలిసింది. ఆయన ఇంటోఉన్న పాత తుపాకీ తీశాడు భార్య అడ్డుపడబోతే ఆమెను పక్కకీడ్చేసి గుమ్మంలో కొచ్చాడు. అక్కడ కూర్చున్నాడు. ఇంతవరకూ ఆ తిట్టిన సంపన్న గృహస్థు మీద తుపాకీ పేలుస్తాడనుకున్న భార్య అతనక్కడ కూర్చోడం చూసి చెదిరిపోయింది.

ఇంటికి రానీ, చవటపీనుగుని. పెద్దల్ని తిడుతుంటే ఏం చెయ్యకుండా ఇంటికి తిరిగొస్తాడా. ఒక్క గుండుదెబ్బతో యీ అవమానాన్ని తుడిచిపెట్టేస్తాను... అని అరిచాడు. భార్య కెవ్వున కేకేసి మూర్ఛపోయింది. సోమనాధంగారూ, ఇరుగూపొరుగువాళ్ళూ వచ్చి వారించడానికి ప్రయత్నించారు, కాని లాభం లేకపోయింది.

అయితే రంగయ్య మాత్రం ఇంటికి తిరిగిరాలే. ఈ సంగతి అతనికెలాగో తెలిసి గాబోలు. చీకటిపడ్డ తరవాత పంతులుగారికోపం ఆదుర్దాగా మారింది. "ఇంకా రాలేదేం యీ పీనుగ..." అన్నాడు సోమనాధంగారితో.

"పోనీలెండి. రాకపోతేనేం. ఎక్కడో ఆత్మహత్య చేసుకుని ఉంటాడు. చెరువులున్నాయి. రైలుంది..." అన్నాడు కొంటెగా సోమనాధం.

"చాల్లేవయ్యా. ఏమిటీ అపశకునం మాటలు?" అన్నాడు పంతులుగారు. "ఏమీలే - ఇంటికొస్తే మీరెలాగా కాల్చేస్తారు. అంచేత ఏ చావైతేనేం!"

ఆ తరవాత సోమనాథం, పంతులుగారూ కలిసి ఊరంతా గాలించారు. రంగయ్య జాడలేదు. ఆనాడు అంతర్థానమైన రంగయ్య అయిదు సంవత్సరాల తరవాత మిలటరీ దుస్తుల్లో ప్రత్యక్షమయ్యాడు.

అప్పుడు సోమనాథంగారన్నారు... "ఆవేళ మీరు భయపెట్టిందొక మిషగాని. ఏదో సాకుచూసుకుని అబ్బాయి వెళ్ళిపోయేవాడే"... అని.

రంగయ్య తన తండ్రి తన్ను చంపడానికి తీసిన తుపాకీ తెరిచి చూశాడు. పకపక విరగబడి నవ్వాడు. ఆ తుపాకి తుప్పుపట్టి పోయింది. లోపల గొట్టం అంతా పూడిపోయింది. అది పంతులుగారి తండ్రిగారు ఉపయోగించేవారు. వెనకటిరోజుల్లో. "అయినా ఇది పాతకాలపు తుపాకి..." అన్నాడు రంగయ్య.

"ఏడిశావు. దీంతో మీ తాతగారు రెండు పెద్దపులుల్ని చంపారు..." అన్నాడు పంతులుగారు.

"అయుండొచ్చు అయితే ఇప్పుడిది పిల్లినికూడా చంపలేదు. మా పిస్టలు చూశారా. దానికంటె ఎంత చిన్నదో. ఇది పేల్చానంటే ఇంక తిరుగులేదు..." అన్నాడు రంగయ్య.

పంతులుగారు పాత తుపాకిని ఆప్యాయంగా నిమిరాడు. దాంట్లో తాతతండ్రుల ప్రభావం ఒక్కసారి ఆయన రక్తనాళాల్లోకి పాకినట్లు అనిపించింది. కాని అది చల్లని గడ్డకట్టుకుపోయిన ప్రభావం అది పేలదు. కొడుకు చేతిలో చిన్న పిస్తోలు చేత్తో పట్టుకు చూశాడు. అది ప్రాణంతో బరువెక్కి పోయినట్టుంది. ఈ పాతకొత్తల అంతరం అకస్మాత్తుగా ఆయనకు పెద్దదెబ్బలాగ మనస్సులో తగిలింది. వెనకటిరోజుల ప్రభావం జీవచ్ఛవం లాంటిది. బరువేగాని కదలిక లేనిది. ఈ కాలపు కొత్త శక్తి చిన్నదైనా చర్రున మెదులుతుంది వింతగా. రెంటికి ఆ ఆయుధాలు రెండూ చిహ్నాలుగా అనిపించాయి ఆ క్షణంలో పంతులుగారికి.

రంగయ్య తల్లిని బుజ్జగించాడు. తండ్రితో తన భావిని గురించి చర్చించాడు. ఈ పాత ఇంట్లో మిగిలిన గది ఒకటే. ఇంక కొద్దిరోజుల్లో కూలిపోతుంది. అంచేత తనతో ఇద్దరినీ ఆగ్రా తీసుకుపోవడానికి నిశ్చయించానని చెప్పాడు. ఈ ఇల్లు ఏదో ఖరీదుకి అమ్మేసి వెళ్ళిపోదామన్నాడు. వద్దని చెప్పడానికి కూడా మనసు రాలేదు పంతులుగారికి.

అర్థరాత్రివేళ పిస్తోలుమోత రంగయ్యని లేపింది పరుగెత్తి వెళ్ళాడు. పడమటి వరండాలో పంతులుగారి శరీరం రక్తపు మడుగులో పడిఉంది. ఆయనచేతిలో తన పిస్తోలుంది.

చూస్తూ అలాగే నిలబడిపోయాడు రంగయ్య.

**(యువ, ఆగస్టు 1971లో అచ్చు అయింది, ఇది పాతకథే అని తోస్తుంది.)**